క్లుప్తంగా

మేయర్ ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు

నెహ్రూనగర్: నగర ప్రజలకు మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగని క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రీస్తు బోధించిన అహింసా మార్గంలో పయనిస్తూ, సాటి వారిని ప్రేమించాలని తెలిపారు. ఆయన ఉపదేశానుసారం పయనించాలని సూచించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ శుభాకాంక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆదివారం ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈస్టర్ పండుగను భగవంతుని రాకకు గుర్తుగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

పారిశుధ్య కార్మికులకు సరుకుల పంపిణీ



నెహ్రూనగర్: నగరంలో రాబిన్ హుడ్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. ముత్యాలరెడ్డి నగర్‌లోని 1వ లైనులో శనివారం రాబిన్ హుడ్ ఆర్మీ సంస్థ ప్రతినిధులు పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ మాట్లాడుతూ రాబిన్ హుడ్ ఆర్మీ సేవా సంస్థ జిల్లావ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని తెలిపారు. ముఖ్యంగా వృద్ధ, అనాథ ఆశ్రమాలకు నిత్యావసర సరుకుల్ని పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

గర్భిణులకు ఖర్జూర పండ్ల పంపిణీ



గుంటూరు మెడికల్: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని గుంటూరు విభాగం జమాఅతే ఇస్లామీ హింద్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి గైనకాలజీ వార్డులో గర్భిణులు, బాలింతలకు ఖర్జూర పండ్లను సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి అందజేశారు. ఖర్జూర పండ్లు బాలింతలకు బలాన్ని ఇస్తాయని ఆమె తెలిపారు. పేదలకు సహాయం చేయడంలో జమాత్ ఇస్లామీ హింద్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జమా అతే ఇస్లామి హింద్ సంఘ సేవా కార్యవర్గ సభ్యులు అబ్దుల్ రషీద్, హాఫిజున్, సీమా, మీడియా కార్యదర్శి ముస్తఫా పాల్గొన్నారు.

చర్మ వ్యాధులపై అవగాహన అవసరం



గుంటూరు మెడికల్: చర్మ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ హనుమానాయక్, డీఎస్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ సూచించారు. గుంటూరు మెడికల్ కళాశాలలో శనివారం ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్‌లు, పీజీలు, హౌస్ సర్జన్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. చర్మ వ్యాధుల్ని ప్రాథమిక దశలో గుర్తించే విధానం, చికిత్స గురించి డాక్టర్ హనుమానాయక్, డీఎస్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ వివరించారు. గుంటూరు జీజీహెచ్‌లో చర్మ సంబంధిత సమస్యలకు అన్ని వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. వ్యాధుల నివారణకు స్టెరాయిడ్స్, యాంటీబయాటిక్స్ వాడటం వల్ల చర్మంపై అనేక దుష్ప్రభావాలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీసరోజిని, డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

ఈస్టర్ పండుగకు చర్చిల ముస్తాబు



పాత గుంటూరు: ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. నగరంలోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని ఈస్ట్ ప్యారిష్, మార్కెట్ సెంటర్‌లోని వెస్ట్ ప్యారిష్, బ్రాడీపేటలోని నార్త్ ప్యారిష్ చర్చి, కన్నావారితోటలోని తెలుగు బాప్టిస్టు సంఘం, విద్యానగర్‌లోని సహాయ మాత చర్చిల్లో ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

వేసవిలో డయేరియా ముప్పు

- కేసులు నమోదయ్యే అవకాశం
- తీవ్రతతో ప్రాణాలకు ప్రమాదం
- ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



2018లో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు (ఫైల్)

గుంటూరు మెడికల్: వేసవిలో వచ్చే వ్యాధుల్లో అతిసార వ్యాధి (డయేరియా) ముఖ్యమైంది. ప్రతి ఏడాది వేసవిలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి.సకాలంలో వైద్యం చేయించని పక్షంలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వ్యాధి దెబ్బకు 2018లో గుంటూరు జిల్లా అతలాకుతలమైంది. సుమారు 20 మంది చనిపోయారు. సుమారు 2,400 మంది వ్యాధి బారిన పడ్డారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు 142 కేసులు నమోదయ్యాయి. ఏ మాత్రం అలక్ష్యం చేసినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులు పాటించాలని జాగ్రత్తల్ని వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

కారణాలు ఇవి.

విరోచనాలు నీళ్లుగా, పలచగా అవుతుంటే డయేరియా (అతిసార వ్యాధి) అంటారు. వైద్య పరిభాషలో దీనిని గ్యాస్ట్రో ఎంటరైటిస్‌గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణవ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరోచనాలు నూటికి 70 శాతం వైరస్ క్రిముల వల్ల వస్తాయి. కలుషితమైన నీటిని తాగడం వల్ల, ఈగలు వాలిన ఆహారం తినడం ద్వారా వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి.

లక్షణాలు ఇవి

- జీర్ణ వ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా ఉండి వాంతులు, విరోచనాలు అవుతాయి.
- విరోచనాలు నీళ్లుగా పలుచగా కావడం, కడుపులో మెలిపెట్టినట్లు నొప్పి ఉంటుంది.
- నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కల నొప్పులు వస్తాయి.
- మనం తాగేనీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. డీహైడ్రేషన్‌లో నాడి వేగంగా లేదా బలహీనంగా కొట్టుకోవడం లేదా ఒక్కోసారి అసలు తెలియకపోవడం ఉంటుంది.
- నీరసం, నోరు, నాలుక, పెదవ కట్టుకుపోతుంది.
- శరీరం ఎండిపోవడం, ఒక్కోసారి మూత్రం అసలు రాకపోవడం లేదా చాలా తక్కువగా వస్తుంది.
- ముదురు పసుపు రంగులో మూత్రం ఉంటుంది.
- వయస్సుతో సంబంధం లేకుండా డీ హైడ్రేషన్ వస్తుంది. దీనివల్ల పిల్లలు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం.

పిల్లల్లో ఇబ్బంది ఎక్కువ



డయేరియా వల్ల పెద్దవారికంటే పిల్లలకు ఎక్కువగా ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తాయి. దాహం పెరిగితే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలి. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తారు. ఒక ప్యాకెట్ పౌడర్‌ను లీటర్ నీటిలో కలుపుకుని తాగాలి. విరోచనాలు అయ్యేవారికి కారం, మసాలా వంటి ఘాటు పదార్థాలు పెట్టకూడదు. పిల్లలకు డయేరియా తగ్గే వరకు వైద్యుల సలహా ప్రకారం మందులు, ఆహారం అందించాలి.

– డాక్టర్ పి.పద్మలత, పిల్లల వైద్య విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

ఉచితంగా వైద్య సేవలు



వేసవిలో కేసులు నమోదయ్యే దృష్ట్యా వైద్య సిబ్బందిని జిల్లావ్యాప్తంగా అప్రమత్తం చేశాం. మందులు, సెలైన్లు, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేసి, ముందస్తుగా గుర్తించి నివారణ చర్యల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయేరియా బాధితులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాం.

–డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్ఓ

ద్రవ రూప ఆహారం ఇవ్వాలి



బాధితులకు ద్రవ రూపంలో ఉండే ఆహారం అందజేయాలి. మజ్జిగ, పాలు, బార్లీ గంజి, పలచగా తయారు చేసిన సగ్గు బియ్యం, రాగి జావ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, సోయాబీన్స్ రసం, ఇతర పళ్ల రసాలు ఇవ్వొచ్చు. కాచి చల్లార్చిన నీటిని తాగడం చాలా ఉత్తమం. ఇంట్లో వైద్యాలు, మందుల షాపుల వద్దకు వెళ్లి మందులు తెచ్చుకోవడం చేయవద్దు. డయేరియా వచ్చినప్పుడు అర్హత ఉన్న వైద్య నిపుణుడి దగ్గరకు వెళ్లాలి.

–డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ

ఎమ్మెల్యే ముస్తఫా



అభిప్రాయాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: రాష్ట్ర ప్రజలందరూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారని చెప్పేందుకు మా నమ్మకం నువ్వే జగన్ – జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు నిదర్శనమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని రామిరెడ్డి తోటలో శనివారం కార్పొరేటర్ యాట్ల రవి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముస్తఫా, వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరిఫాతిమా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి అభిప్రాయాలు సేకరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. గత ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని చూపుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని విన్నవించారు. ఆయా నివాసాల యజమానుల అనుమతితో డోర్ స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ముందుకు వెళుతున్నాయని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని తెలిపారు. మరో 30 ఏళ్లపాటు జగనే ముఖ్యమంత్రిగా ఉండటం తథ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, జేసీఎస్ రీజినల్ కో– ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు సురేష్, బాష, శ్యామల, మధు, దుర్గాప్రసాద్, పసుపులేటి రామయ్య పాల్గొన్నారు.

సిబార్‌లో ఫ్రెషర్స్ డే వేడుకల సందడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాంబాబు

పెదకాకాని: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాల్ని అధిరోహించగలరని పెదకాకాని ఎస్ఐ వి. రాంబాబు సూచించారు. తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాల్ని ఎంచుకొని సాధించే వరకూ శ్రమించాలని చెప్పారు. కార్యక్రమానికి కళాశాల డీన్ డాక్టర్ లింగమనేని కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ రేవతి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రుల కోర్కెల్ని నెరవేర్చి, తద్వారా కళాశాల కూడా మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సిబార్ డైరెక్టర్ డాక్టర్ టి, కృష్ణమోహన్, డాక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

సర్పంచుల సంక్షేమ సంఘం సమావేశం



జాస్తి వీరాంజనేయులను సన్మానిస్తున్న పాపారావు, సర్పంచులు

పాత గుంటూరు: బ్రాడీపేటలోని సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి నిధులు లేక సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల్లో జాప్యం జరుగుతుందని, వెంటనే విడుదల చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ జాస్తి వీరాంజనేయులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరుదల సాంబశివరావు, సర్పంచులు ఉయ్యూరు అప్పిరెడ్డి, తోకల సరోజిని, మబ్బు శిరీష, డి. సూర్య ప్రకాశరావు, నల్లిపోయిన శ్రీనివాసరావు, ఎన్. లలిత కుమారి పాల్గొన్నారు.

ఆదిమవాసులపై వైమానిక దాడులు నిలిపివేయాలి



సభలో మాట్లాడుతున్న చిలుకా చంద్రశేఖర్

పాత గుంటూరు: దండ కారణ్యం ప్రాంతంలో ఆదిమవాసులపై కేంద్ర ప్రభుత్వం వైమానిక బాంబు దాడుల్ని తక్షణం నిలిపివేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని కొరటాల భవన్‌లో శనివారం ఆదిమవాసులపై వైమానిక దాడులు, నిజ నిర్ధారణ, కర్తవ్యాలు అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. పౌర హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు వి.చిట్టిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ దండకారణ్యం ప్రాంతంలో విలువైన ఖనిజాలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదిమవాసుల్ని ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమాయక ఆదివాసి, గిరిజన రైతాంగంపై డ్రోన్లు వైమానిక దాడుల్ని తక్షణం విరమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దిశగా అన్ని రాజకీయ పార్టీలు, హక్కుల సంఘాలు, పౌర సమాజం స్పందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణరావు, విరసం నాయకులు పాణి, అమరుల బంధుమిత్రుల సంఘం నాయకురాలు అంజమ్మ, ప్రజా కళామండలి నాయకులు జె.కోటి పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్‌కు స్పందన



పాత గుంటూరు: ఏసుక్రీస్తు సజీవుడైన దేవుడని, అందరూ సాటి వారిపై ప్రేమను కలిగి ఉండాలని రెవరెండ్ విక్రాంత్ వర్ధన్ తెలిపారు. మార్కెట్ సెంటర్‌లోని వెస్ట్ ప్యారిష్ చర్చి నుంచి శనివారం రన్ ఫర్ జీసస్‌ను ప్రారంభించారు. రెవరెండ్ జి. సతీష్‌బాబు ప్రారంభ ప్రార్థన చేశారు. ముఖ్య అతిథిగా ఐటీసీ ఉపాధ్యక్షుడు ఎం. ఐజక్ డేవిడ్ పాల్గొని, పరుగును ప్రారంభించారు. నగరంలోని ప్రధాన రహదారుల్లో సాగిన రన్ ముగింపు కార్యక్రమంలో బిషప్‌లు శాంసన్ రాబర్ట్, రూజ్ వెల్ట్, థాంప్సన్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మోజెస్, డాక్టర్ ఉమాశంకర్, రెవరెండ్ పరిశుద్ధరావు, అంతర్జాతీయ సంగీత దర్శకుడు జె.కె. వర్ధన్ బృందం, పాస్టర్ రాఫా ఆడమ్స్, ఈపీఎఫ్ అధ్యక్షుడు యు. మోహన్, సాంఘిక సంఘాల సభ్యులు, పాస్టర్లు, ఫెలోషిప్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లాడ్జిపై పోలీసుల దాడి

గుంటూరు ఈస్ట్: లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కొరిటెపాడులోని ఓ లాడ్జిలో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారం అందుకున్న పోలీసులు శనివారం దాడి చేశారు. ముగ్గురు వ్యభిచార నిర్వాహకులు, విటుడు, మహిళను అదుపులోకి తీసుకున్నారు. మహిళల్ని రెస్క్యూ హోంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10న శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి రాక



సమావేశంలో మాట్లాడుతున్న మస్తానయ్య

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఈ నెల 10న విచ్చేస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య తెలిపారు. ఆలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10న సాయంత్రం విశేష శోభాయాత్రగా స్వామికి పూర్ణ కుంభస్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. 13న సాయంత్రం వరకు స్వామివారు ఆలయంలో విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి రోజు ఆరు గంటల పాటు మహా త్రిపుర సుందరీ దేవి సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి త్రికాల పూజలు, చండీ యాగం, అనుగ్రహ భాషణం జరుగుతాయని తెలిపారు. 11న సాయంత్రం డాక్టర్ డీ.ఎస్. దీక్షిత్ రచించిన శ్రీ వేంకటాచల మహత్మ్యం గ్రంథాన్ని స్వామి ఆవిష్కరిస్తారని మస్తానయ్య చెప్పారు. సమావేశంలో కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి పూటుకూరి నాగేశ్వరరావు, పి.ప్రభాకరరావు, కోశాధికారి లంక సూర్యనారాయణ, ఆవుల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన సీఎం



డాక్టర్ వై. షేక్

పట్నంబజారు: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై. షేక్ తెలిపారు. ఎత్తు రోడ్డు సెంటర్‌లోని ఆయన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి పేదవాడికీ రూపాయి కూడా ఖర్చు లేకుండా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కుంటుపడిన 108, 104 వ్యవస్థల్ని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రతి పేదవాడి గడప వద్దకు వైద్యం అందించాలనే నిశ్చల దృక్పథంతో ఆయన ముందుకు సాగుతున్నారని తెలియజేశారు. వైద్య విధానాన్ని మరింత పటిష్ట పరిచే దిశగా ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో జగనన్న పాలనలో 'వైద్య విధానాలు – సంస్కరణలు' అనే అంశంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశానికి వైద్య విభాగానికి చెందిన రాష్ట్ర నేతలు, ఆరోగ్యశ్రీ ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతున్నట్లు డాక్టర్ షేక్ తెలిపారు. జిల్లాలోని వైద్య విభాగ నేతలు, వైద్యులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న ప్రతినిధులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ ఐదో లైనులోని జేసీఐ గూగుల్స్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గూగుల్ అడ్వైజర్ నిశ్చల్ నరసింహన్ ప్రారంభించారు. అధ్యక్షురాలు మేకల చాముండేశ్వరి పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో జేసీఐ ప్రతినిధులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిశ్చల్ నరసింహన్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పలువురు రక్తదానం చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో గూగుల్స్ జోన్ డైరెక్టర్ కార్తీక్, ప్రతినిధి సిమ్రాన్ కౌర్, వేణు ప్రతాప్, రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ షేక్ జాని రసూల్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రజలంతా సంతోషం



బ్రోచర్ అందిస్తున్న పద్మావతి



నంబూరులో ప్రచార కార్యక్రమంలో భీమవరపు విజయలక్ష్మి తదితరులు

గుంటూరు రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని గుంటూరు రూరల్ మండలం వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి తెలిపారు. శనివారం మండలంలోని తురకపాలెంలో మా నమ్మకం నువ్వే జగనన్న, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ప్రజా బ్యాలెట్‌లోని ప్రశ్నల్ని ప్రజలకు వివరించి వారి అభిప్రాయాలు సేకరించారు. జేసీఎస్ మండల కన్వీనర్ వెంకట్, గ్రామ సర్పంచ్ సూర్యప్రకాశరావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

- మండలంలోని పొత్తూరు, బుడంపాడు తదితర గ్రామాల్లో స్థానిక జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు.

జగనన్న చేతుల్లోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు

కొమ్మూరు(కాకుమాను): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల్లోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఆధారపడి ఉందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు అన్నారు. మండలంలోని కొమ్మూరులో శనివారం సాయంత్రం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పున్నారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థుల్ని అఖండ మెజార్టీతో గెలించి అన్న జగనన్నను ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.గ్రామంలో ఇంటింటికీ తిరిగి నాలుగు సంవత్సరాలుగా జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.

పెదకాకాని: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి పెదకాకాని మండలంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు శ్రీకారం చుట్టారు. మండలంలోని నంబూరులో శనివారం ప్రతి ఇంటికీ వెళ్లి , ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సేవలు, మేలు గురించి ప్రజలకు తెలియజేశారు. ఇంటి యజమానుల అనుమతితో డోర్ స్టిక్కర్లను అంటించారు. కుటుంబ పెద్ద సెల్ నంబర్ నుంచి మిస్డ్ కాల్ ఇప్పించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పట్నంబజారు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజ్జనగుండ్ల ప్రాంతం నుంచి నెహ్రూనగర్‌కు ముద్రబోయిన వెంకటేశ్వరరావు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. నెహ్రూనగర్ రైల్వే గేటు వద్ద 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై కేసు నమోదు

స్వల్ప ఘర్షణ నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌పేటలోని నివాసం ఉండే అఫ్రోజ్‌పై స్వల్ప ఘర్షణ నేపథ్యంలో సజ్జిత్ బాషా, ఇనాయతుల్లా అతని కుమారుడు కలసి దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినిని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

విద్యార్థినిని వెంటపడి ఇబ్బందులకు గురి చేస్తున్న యువకుడిపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదవుల బజారుకు చెందిన మార్నెళ్ల అనూష ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో కొండెపు ఈశ్వర్ నిత్యం వెంటపడి వేధిస్తున్న పరిస్థితుల్లో విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

పెదనందిపాడు: మానసికస్థితి సరిగాలేని యువతిపై అత్యాచారం చేసిన యువకుడిని అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు సీఐ వెంకటసుబ్బారావు తెలిపారు. పెదనందిపాడు పోలీసుస్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితుడు కారంపూడి లచ్చం సుబ్బారావును అబ్బినేనిగుంటపాలెం అడ్డరోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడిని బాపట్ల కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి అన్నామణి రిమాండ్ విధించినట్లు చెప్పారు. నిందితుడిని గుంటూరు సబ్ జైలుకు తరలించినట్లు ఆయన తెలియజేశారు. సమావేశంలో ఎస్ఐ అబ్దుల్ రెహమాన్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.